సాక్షి ఒడిశా

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,12,588లు, బంగారం 7 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 200 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆయిల్ ట్యాంకర్ బోల్తా

గజపతి జిల్లా అడవ పోలీసుస్టేషన్ పరిధి ఖరిగుడ జాతీయ రహదారి వద్ద మంగళవారం ఉదయం ఒక పెట్రోలు ట్యాంకర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది.

- 8లో



స్వయం ఉపాధిపై వర్క్‌షాపు

పర్లాకిమిడి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు గ్రామీణ స్వయం ఉపాధిపై వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

విస్తృతంగా వాహన తనిఖీలు



ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొక్కిస్తున్న దృశ్యం

జయపురం: పట్టణ పోలీసులు నింబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వాహనాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. పట్టణ పోలీసు అధికారి ఉల్లాస్ చంద్రరౌత్ ఆదేశాల మేరకు జయపురం మెయిన్‌రోడ్డు, పోలీసుస్టేషన్ ముందు 26వ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అధిక శబ్దం చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్న 28 బైక్‌లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి మోటారు వెహికల్ చట్టం ప్రకారం జరిమానాలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే వాటి సైలెన్సర్లను తొలగించి రోలర్‌తో తొక్కించారు. రోడ్లపై న్యూసెన్స్ సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పర్యాటకుడు సురక్షితం



లైఫ్ గార్డుల బృందంతో పర్యాటకుడు

భువనేశ్వర్: పూరీ సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక పర్యాటకుడు మునిగిపోయాడు. ఉప్పొంగిన కెరటాల్లో కొట్టుకుపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ దృశ్యం తీరంలో పహారా కాస్తున్న లైఫ్ గార్డుల దృష్టికి రావడంతో తక్షణమే సముద్రంలోకి దూకి ఆదుకున్నారు. సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పూరీ సాగర తీరం 9వ నంబర్ సెక్టారులో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. లైఫ్ గార్డుల సాయంతో ప్రాణాలతో ఒడ్డుకు చేరిన పర్యాటకుడు కెంజొహార్ ప్రాంతానికి చెందిన వికాస్ నాయక్‌గా గుర్తించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని టికిరి జగన్నాథ మందిరం సమీపంలో రోడ్డుపై దొరికిన సెల్‌ఫోన్‌ను బాధితుడికి పోలీసుల సమక్షంలో అప్పగించి ఒక వ్యక్తి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. నయాగడ జిల్లా బెగునియాపట్న ప్రాంతానికి చెందిన సంతోష్ కుమార్ రవుత్ అనే వ్యక్తి టికిరి గ్రామంలో జరిగే అగ్ని భైరవ ఉత్సవాలను తిలకించేందుకు ఆదివారం వచ్చాడు. ఈ క్రమంలో ఉత్సవాలను తిలకించే సమయంలో తనకు జగన్నాథ మందిరం సమీపంలో ఒక సెల్‌ఫోన్ దొరికింది. దీంతో దొరికిన సెల్‌ఫోన్‌ను సోమవారం పోలీసులకు అప్పగించాడు. అయితే అప్పటికే తన సెల్‌ఫోన్ పోయినట్లు ఉషాపాడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ బిడిక అనే వ్యక్తి టికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న బాధితుడికి అప్పగించారు.

బడులకు వెళ్దాం రండి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జయపురం: జయపురం సబ్ జైలు రోడ్డులో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం 8వ వార్డులో రండి బడులకు వెళ్దాం అభిజాన్‌లో ర్యాలీ మంగళవారం నిర్వహించారు. బడులకు వెళ్దాం.. బాగా చదువుదాం, మంచి రాష్ట్రాన్ని నిర్మిద్దాం అనే నినాదాలు చేశారు. జైలు రోడ్డు, నెహ్రూ నగర్, మహాత్మాగాంధీ రోడ్డు, పీడబ్ల్యూడీ లైన్, డెప్పిగుడ మొదలగు ర్యాలీ చేపట్టారు.

రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అఖిల పక్ష సమావేశంలో ఖరారు
- మొత్తం ఏడు రోజుల పాటు సమావేశాలు
- అన్ని పార్టీలు సహకరించాలి: స్పీకర్ సురమా పాఢి



స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో అసెంబ్లీ సమావేశ మందిరంలో స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన మంగళవారం అఖిల పక్ష సమావేశం జరిగింది. వర్షాకాలం సమావేశాల్లో సభలో కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడడమే ఈ సమావేశం ప్రాథమిక లక్ష్యం. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ, విపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్, వామపక్షం కమ్యునిస్టు (మార్క్సిస్టు) ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి మోహన్ మాఝి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడాలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సభలో వర్షాకాల సమావేశాలు సజావుగా నడపడానికి అఖిల పక్ష సభ్యుల సహకారం అనివార్యమని స్పీకర్ అన్నారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈనెల 18 నుంచి ప్రారంభమై 25వ తేదీ వరకు కొనసాగుతాయి. స్వల్ప కాలిక ఈ సమావేశాలను ఫలప్రదంగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సమావేశల్లో మొత్తం 7 పని దినాలు ఉంటాయి. వాటిలో ఒక రోజు ప్రైవేటు సభ్యుల బిల్లులు, మరో రోజు నో ఆఫీసు డే ఉంటాయని ఖరారు చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

శాసనసభ వర్షాకాల సమావేశాలు పురస్కరించుకొని నగరంలో వాహనాల రాకపోకలను నియంత్రించాలని కమిషనరేట్ పోలీసులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి 25 వరకు జరిగే ఈ సమావేశాల్లో భద్రతా కారణాల దృష్ట్యా రాష్ట్ర శాసనసభ పరిసరాల్లో వాహనాల రవాణా నియంత్రించడానికి ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను సిఫార్సు చేశారు. నిషేధిత ప్రాంతాల్లో రద్దీని నివారించడానికి ప్రయాణికులు తమ ప్రయాణాలను తదనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ ఆంక్షలు పోలీసు, అగ్నిమాపక మరియు అంబులెన్స్ సేవలతో సహా అత్యవసర వాహనాలకు వర్తించవు. అలాగే రాష్ట్ర శాసనసభ, రాష్ట్ర సచివాలయం మరియు ఇతర పరిపాలనా భవనాలు వంటి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి వచ్చే అనుమతి కలిగిన వాహనాలను యథాతదంగా రాకపోకలు చేసేందుకు అనుమతిస్తారు.

వాహనాల రవాణా నిబంధనలు

- హౌసింగ్ బోర్డు స్క్వేర్ నుంచి రవీంద్ర మండపం వైపు వచ్చే వాహనాలను కేశరి టాకీస్ స్క్వేర్ వద్ద మళ్లిస్తారు.
- ఏజీ స్క్వేర్ నుంచి పీఎంజీ వైపు వచ్చే వాహనాలు జయదేవ్ భవన్ వద్ద కుడి వైపునకు తిరిగి ఇందిరా గాంధీ పార్క్ రోడ్డులో వెళ్లాలి.
- మాస్టర్ క్యాంటీన్ వైపు నుంచి పీఎంజీ వైపు వచ్చే అన్ని వాహనాలను దిగువ పీఎంజీ వద్ద పక్కనే ఉన్న వీధి దగ్గర మళ్లిస్తారు.
- 120 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ స్క్వేర్ నుంచి వచ్చే వాహనాలను రవీంద్ర మండపం వైపు నివారించి పవర్ హౌస్ స్క్వేర్ వైపు మళ్లిస్తారు.
- రాజ్ భవన్ స్క్వేర్ నుంచి ఎమ్మెల్యే కాలనీ మరియు రవీంద్ర మండపం వైపు వచ్చే వాహనాలను శాస్త్రి నగర్ స్క్వేర్ వైపు మళ్లిస్తారు.

నేడు విపక్ష సమావేశం

ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ శాసన సభా పక్ష సమావేశం బుధవారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. స్వల్పంగా వారం రోజుల నిడివితో ముగుస్తున్నందున పూర్తి సమయాన్ని రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఉపకరించే దిశలో సద్వినియోగపరచుకోవాలని విపక్షం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఘాటుగా నిలదీసేందుకు కసరత్తు చేస్తోంది.

అవిశ్వాస తీర్మానం యోచన

కాంగ్రెసు పార్టీ సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ నుంచి ఈ మేరకు సాయం ఆకాంక్షిస్తోంది. లేకుంటే ఒంటరిగానైనా అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు పట్టుదలగా ఉంది. ప్రతిపక్షాలు అనేక కీలక అంశాలపై ప్రభుత్వాన్ని ఇరికించడానికి సిద్ధమవుతున్నందున ఈ సమావేశాలు సభలో తుఫాను అలజడి రేపే అవకాశం ఉంది. దీనికి ప్రతిస్పందనగా అధికార భారతీయ జనతా పార్టీ దీటుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధత వ్యక్తం చేస్తోంది.

విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన



కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గుమ్మలో కొత్తగా నిర్మించిన ఏకలవ్య ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాల ఆరు మాసాలుగా తెరవలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. గుమ్మ, నువాగడ, రాయఘడ, ఆర్.ఉదయగిరిలోని రామగిరి, మోహనాలో కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య ఆదర్శ రెసిడెన్సియల్ విద్యాలయాలు నిర్మించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఆర్.ఉదయగిరిలో రాత పరీక్ష నిర్వహించింది. అందులో 60 మంది గుమ్మ ఏకలవ్య పాఠశాలకు ఎంపికైనట్లు జాబితా ప్రచురించారు. అయితే ఇప్పటివరకు పాఠశాలలో తరగతి గదులు పూర్తి కానందున విద్యార్థులకు క్లాసులు మొదలు పెట్టలేదు. దీంతో తమ పిల్లలు ఒక విద్యా సంవత్సరం కోల్పోతున్నారని తల్లిదండ్రులు ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో వద్ద విన్నవించారు. మొత్తం 60 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి వినతిపత్రం అందజేశారు. దసరా సెలవుల్లోగా పాఠశాలలు తెరవకపోతే రస్తారోకో చేపడతామని హెచ్చరించారు.



పనులు పూర్తవ్వని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల

గురువులదే గురుతర బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

జయపురం: సమాజ నిర్మాణంలో గురువులదే గురుతర బాధ్యత అని స్థానిక విక్రమదేవ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మహేశ్వర చంద్ర నాయక్ అన్నారు. వర్సిటీ ఉపాధ్యాయ శిక్షణ(బీఈడీ) విభాగం నిర్వహించిన బీఈడీ ప్రథమ సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ శిక్షణ పొందిన తర్వాత విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది సమాజానికి అందించాలని సూచించారు. స్నాతకోత్తర పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో వర్సిటీ ఉపాధ్యాయుల శిక్షణా విభాగం నిర్వహిస్తున్న భూమికను ప్రశంసించారు. ఉపాధ్యాయ శిక్షణ విభాగ ప్రధాన అధికారి డాక్టర్ మనోరంజన్ ప్రదాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు అధ్యాపకులుగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లోకేష్ ప్రధాన్, కస్తూరీ ఆచార్య, అనిత పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్ విడుదల చేస్తున్న దృశ్యం

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డొంగిరియాలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పరిధి నియమగిరి పర్వత ప్రాంతాల్లో డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలు నివసిస్తున్న పర్యాలి, సునాఖుంటి పంచాయతీ పరిధిలో దాదాపు 23 గ్రామాలు అంధకారంలో ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమకు విద్యుత్ వెలుగులు కల్పించాలని కోరుతూ డొంగిరియా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయా పంచాయతీలకు చెందిన డొంగిరియాలు కలెక్టర్ అశుతోష్ కులకర్ణిని కలిసి తమ గోడును వినిపించారు. ఇదివరకు ఆయా గ్రామాల్లో సోలార్‌తో నడిచే విద్యుత్ వీధి దీపాలను యంత్రాంగం ఏర్పాటు చేసిందని వినతిపత్రంలో వివరించారు. అయితే ఏర్పాటు చేసిన కొద్ది కాలానికే అవి మరమ్మతులకు గురవ్వడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయని తెలిపారు. అందువలన శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సునాఖండి పంచాయతీకి చెందిన బొన కద్రక, మహేశ్వర్ కద్రక, ముధు వడక, పర్యాలి పంచాయతీకి చెందిన కృష్ణ సికక, కులసిక రాము పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న పోలీసు అధికారులు

జయపురం: పట్టణంలోని సీనియర్ సిటిజన్లు దరఖాస్తు చేసుకుంటే పోలీసు యంత్రాంగం సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డులు సమకూర్చుతుందని జయపురం పట్టణ పోలీసుస్టేషన్ అధికారి ఉల్లాస్ చంద్ర రౌత్ తెలియజేశారు. స్థానిక జేఈఎన్‌సీ చర్చి సభాగృహంలో పట్టణ పోలీసులు అమో పోలీసు సమితి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి రాత్రి సమయాల్లో రచ్చ చేసేవారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంఘ వ్యతిరేక ఘటనలు జరిగినప్పుడు సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. పట్టణంలో నేరాలు నియంత్రించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు సిద్ధాంత బెహర, రుచికాంత మహాకురమ్, నవీన చంద్ర చౌదరి, ఆర్.పంగి, ఏఎస్ఐలు సత్యబాది నాయక్, డీపీ పండ, కేసీహెచ్ మిశ్ర, సపన్ కుమార్ మిశ్ర తదతరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజలు

ఉపాధ్యాయుడిని బదిలీ చేయండి



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి నకిటి పంచాయతీలోని సారొముండా గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిని బదిలీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నటువంటి ఈ పాఠశాలలో చదువులు సక్రమంగా కొనసాగడం లేదని, సరిగ్గా ఒక ఉపాధ్యాయుడు విధులకు హాజరవ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇదే విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వివరించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఈ ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు మధ్యాహ్న భోజనం సమయంలో మాత్రమే వచ్చి వెళ్లిపోతున్నారన్నారు. అతను ఎప్పుడూ పాఠాల చెప్పడం లేదని పేర్కొన్నారు. దీంతో తమ పిల్లల భవిష్యత్ నాశనమవుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అదనపు అధికారి భజన్ లాల్ మాఝి దృష్టికి తీసుకెళ్లగా దర్యాప్తు చేసి చర్యలు చేపడతామని చెప్పారు.

భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన గుడ్డు రయితో

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఆపరేషన్ ప్రహార్ నడుస్తున్న నేపథ్యంలో మోహనా పోలీసు అధికారి బసంత్ శెఠి నేతృత్వంలో మంగళవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా శికుళిపదర్ గ్రామం రోడ్డు భగమర్రి వద్ద పది బస్తాల గంజాయి రవాణా చేయడానికి ఒక వ్యక్తి ఎదురు చూస్తుండగా పట్టుబడినట్టు ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా వెల్లడించారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి గుడ్డు రయితోగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి సమారు 2.20 క్వింటాళ్లు ఉంది. దీని విలువ మార్కెట్‌లో రూ.20 లక్షలు ఉంటుందని మోహనా ఐఐసీ బసంత్ కుమార్ శెఠి తెలియజేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచారు.

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ పోలీసులు ఒక ఆటోలో ఒక క్వింటాల్ 3 కేజీల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. బొయిపరిగుడ పోలీసు అధికారి డొంబురుదొర బత్రిక మంగళవారం వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి పెట్రోలింగ్ జరుపుతుండగా బొయిపరిగుడ – కొరాపుట్ జంక్షన్ మీదుగా ఒక ఆటో వేగంగా వస్తూ కనిపించింది. ఆటో డ్రైవర్ పోలీసులను చూసి వెంటనే ఆటోని విడిచిపెట్టి అడవిలోకి పారిపోయాడు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు వెంటబడినా చీకటిగా ఉండడం వలన సాధ్యం కాలేదు. డ్రైవర్ విడిచిపెట్టిన ఆటోను తనిఖీ చేయగా అందులో నాలుగు గంజాయి బస్తాలు పట్టుబడ్డాయని పోలీసు అధికారి వెల్లడించారు. ఆటోతో గంజాయిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆటోలో మొత్తం ఒక క్వింటాల్ 3 కిలోల గంజాయి ఉందని వెల్లడించారు. కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో...

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో 27 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గజపతి జిల్లా అడవా ప్రాంతానికి చెందిన సుదామ్ నాయక్, ఆర్.ఉదయగిరి ప్రాంతానికి చెందిన నానునా బెవర్త ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గుణుపూర్ రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఒక మహిళ, మరో యువకుడి బ్యాగులు తనిఖీలు చేయగా అందులో గంజాయి పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.95 వేలు ఉంటుందని అంచనా వేశారు.



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు

క్లుప్తంగా

పారిశుద్ధ్య సమస్య పట్టించుకోరా?



రోడ్డుపై బైఠాయించిన అందవరం గ్రామస్తులు

జలుమూరు: పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం అందవరం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. అందవరం, రామకృష్ణాపురం, గొల్లపేట గ్రామాల్లో రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దోమలు వ్యాప్తి చెంది అంటు రోగాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు కూడా వెలగడం లేదని, ఇసుక లారీల వల్ల రోడ్డు గోతులమయంగా మారిందని వాపోయారు. విషయం తెలుసుకున్న పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు గ్రామస్తులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

పలాస: ఒడిశా రాష్ట్రం జగిదిపదర్ గ్రామానికి చెందిన హేమంత్ సబర్, కేశబ్‌సబర్‌లు పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో మంగళవారం అనుమానాస్పదంగా తిరగడంతో పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి బయటపడిందని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. మూడు ప్యాకెట్లలో ఉన్న 16.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. నిందితులను పలాస కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. ఒడిశా రాష్ట్రం రాజ్‌బోసా గ్రామానికి చెందిన అమస్ అలియాస్ జూన్‌హేన్సన్ వద్ద గంజాయి తీసుకుని కర్ణాటక రాష్ట్రానికి చెందిన సంజురైతో అనే వ్యక్తికి ఇచ్చేందుకు వీరు వెళ్తున్నట్లు గుర్తించామన్నారు. పలాస రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి సిబ్బందితో కలిసి పట్టుకున్నారని సీఐ చెప్పారు. గంజాయితో పాటు సెల్‌ఫోన్, రూ.3,650 నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నీట్ పీజీ ఫలితాల్లో మెరిసిన విశాల్



నందిగాం: దేవళభద్ర పంచాయతీ జల్లపల్లికి చెందిన ఆరంగి విశాల్ నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 5136వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 296వ ర్యాంకు సాధించాడు. విశాల్ తండ్రి జానకిరామయ్య బ్యాంకు అధికారి కాగా , తల్లి సరిత గృహిణి. విశాల్ ఎంబీబీఎస్ శ్రీకాకుళం రిమ్స్‌లో పూర్తి చేశాడు. మారుమూల గ్రామానికి చెందిన విశాల్ పీజీలో ఉత్తమ ర్యాంకు సాధించడం తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుడు అదృశ్యం



గజపతి సందీప్

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన గజపతి సందీప్ (14) అనే బాలుడు అదృశ్యమైనట్లు మేనత్త కొర్రాయి సుజాత కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. పాఠశాలకు సరిగా వెళ్లకపోవడంతో మందలించామని, ఆ తర్వాత ఈ నెల 14న ఒడిశా రాష్ట్రంలోని తమ స్వగ్రామమైన గజపతి జిల్లా ఒతిసింపూర్ వెళ్లిపోతానని చెప్పి వెళ్లిపోయాడని, అక్కడికి కూడా వెళ్లలేదని తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

21న నవయువ కవితా మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, విశ్వసాహితీ కళావేదిక, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 21న శ్రీకాకుళం నవ యువ కవితా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఈవేమన, జంధ్యాల శరత్‌బాబు, భమిడిపాటి గౌరీశంకర్ తెలిపారు. మునసబుపేటలోని గురజాడ విద్యా సంస్థల ఆవరణలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు ఉత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ మార్గదర్శకత్వం లో అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రజిని, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, గురజాడ సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, విశ్వసాహితీ కళావేదిక అధినేత కొల్లి రమావతి పాల్గొంటారని వివరించారు.

డొంబొసారోను సమితిగా గుర్తించాలి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సమితి పరిధి డొంబొసారా పంచాయతీని సమితిగా గుర్తించాలని పంచాయతీకి చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సమితి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అభివృద్ధి దిశగా పయనిస్తున్న డొంబొసారా పంచాయతీని సమితిగా గుర్తిస్తే మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు మౌలిక సౌకర్యాలు చేకూరుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను సమితులుగా గుర్తిస్తున్న నేపథ్యంలో తమ ప్రాంత డొంబొసారో పంచాయతీని సమితిగా గుర్తించాలని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పటికైనా స్పందించి సమితిగా గుర్తించాలని వారంతా కోరారు.



ఆందోళన చేస్తున్న డొంబొసారో పంచాయతీ ప్రతినిధులు

ఘనంగా శ్రీకృష్ణ జయంతి



పూజా, అర్చన కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు సోమవార ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, అర్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో రాధా కాంతులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కుంకుమ, తులసీ దళాలతో అర్చనలు చేశారు. అనంతరం భాగవత, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అదేవిధంగా ఉట్టు కొట్టే కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షుడు చంద్రమౌళి కుముందాన్, కార్యదర్శి రాఘవ కుముందాన్, శ్రీనివాస్ కుముందాన్ తదితరులు పాల్గొన్నారు.



రాధా, కాంతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు



ఉట్టిని కొడుతున్న శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారి

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన పెట్రోలు ట్యాంకర్ వాహనం

పర్లాకిమిడి: గజపతి జిల్లా అడవ పోలీసుస్టేషన్ పరిధి ఖరిగుడ జాతీయ రహదారి వద్ద మంగళవారం ఉదయం ఒక పెట్రోలు ట్యాంకర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ట్యాంకర్ వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ పెట్రోలు ట్యాంకర్ పారాదీప్ నుంచి గజపతి జిల్లా మీదుగా బిసంకటక్ వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఘటనా స్థలానికి అడవ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తుండగా, ట్యాంకరు లీకై పెట్రోలు కారుతుండడం గమనించి మోహనా నుంచి అగ్నిమాపక దళం విచ్చేసి క్రేన్లతో పెట్రోలు ట్యాంకర్‌ను ఎత్తి పెద్ద విపత్తును ఆపగలిగారు. అడవ పోలీసు అధికారులు ఈ సంఘటనపై దర్యాప్తు చేసున్నారు.

స్వయం ఉపాధిపై వర్క్‌షాపు



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు అధికారి దిలీప్ కుమార్ తంతి

పర్లాకిమిడి: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు గ్రామీణ స్వయం ఉపాధిపై వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంకు సీనియర్ ట్రైనర్ దిలీప్ కుమార్ తంతి, ఐఎస్ఆర్‌డీ సఖీ వన్‌స్టాప్ సెంటర్ కేర్ ఉమెన్ మోహినీ ప్రధాన్, మహిళా కళాశాల అధ్యక్షురాలు డా.రీనాసాహు తదితరులు పాల్గొన్నారు. మహిళా కళాశాల విద్యార్థినులు డిగ్రీ తర్వాత ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలలో వివరించారు. కార్యక్రమంలో ఎంవైబీ సభ్యులు వి.భవానీ ప్రసాద్, ఎ.ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

913 అంగన్‌వాడీలు ప్రారంభం



వర్చువల్‌గా అంగన్‌వాడీలు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడా తదితరులు

పర్లాకిమిడి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతీ పరిడా, మంత్రి రబినారాయణ నాయక్‌లు వర్చువల్‌గా రాష్ట్రంలో 913 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. వాటిలో గజపతి జిల్లాలో 14 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ మధుమిత, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి శంకర్ కెరకెటా, అదనపు సీడీఎం పృథ్వీరాజ్ మండల్, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

జయపురం: పట్టణంలో నిర్వహించనున్న చారిత్రాత్మక దసరా ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా జయపురం మహారాణి సారిక దేవిని జయపురం దసరా ఉత్సవ కమిటీ మంగళవారం ఆహ్వానించింది. దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కమిటీ సభ్యులతో కలిసి కోటకు వెళ్లి మహారాణికి అందజేసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బినోద్ మహాపాత్రో, డాక్టర్ సురేష్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

కర్షకులకు కరెంట్ కష్టాలు


- వేధిస్తున్న విద్యుత్ సమస్య
- ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు 50 పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- హెచ్చుతగ్గులతో కాలిపోతున్న మోటార్లు



కవిటి మండలం పుటియాదళలో 51 విద్యుత్ కనెక్షన్లు కలిగి ఉన్న 100 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్

కవిటి : వ్యవసాయం, రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతనకుదరడం లేదు. ఇప్పటికే యూరియా, ఎరువులు పూర్తిస్థాయిలో అందక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలకు కరెంట్ కష్టాలు సైతం వెంటాడుతున్నాయి. ఉద్దాన ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ బోరు బావులపైనే ఆధారపడి సాగు జరుగుతోంది. కవిటి మండలం పుటియాదళ రెవెన్యూ గ్రామాల్లో రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు పెద్దసమస్యగా మారాయి. ఇక్కడ 276 ఎకరాలు వరిసాగు విస్తీర్ణం ఉంది. ఈ ఏడాది నెలకొన్న ప్రత్యేక పరిస్థితులలో దమ్ముల సీజన్‌లో మినహాయించి వరినాట్లు వేశాక సరైన వర్షం లేక అన్నదాత బోరుమంటున్నారు. ఇలాంటి సమయంలో అండగా నిలవాల్సిన ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు మొరాయిస్తున్నాయి. మోటార్లు తిరగడం లేదు. దీనికి కారణం ఏంటని ఆరా తీస్తే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 51 వరకు కనెక్షన్లు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దీనివల్ల ఇటీవల 8 మోటార్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మోటార్లు తిరగడం లేదు..



ఏడాదికి ఒకే పంట పండిస్తున్నాం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్‌మోటార్లు మాకు శ్రీరామరక్ష అనే భావనతో ఉండేవాళ్లం. కానీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పరిమితికి మించి కనెక్షన్లు ఉండటంతో అసాధారణంగా లోడ్ పెరిగింది. మోటార్లు తిరగడం లేదు. తక్షణం విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రైతుల్ని ఆదుకోవాలి.

– బెందాళం వెంకటేశ్వరరావు, రైతు, కవిటి

కాలిపోతున్నాం..



పుటియాదళలో ఎకరా పైగా వరిపొలం ఉంది. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా లేక విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతున్నాం. మా ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఈ సీజన్‌లో 8 మోటార్లు కాలిపోయాయి. ఎప్పుడు ఎవరి మోటార్ కాలిపోతోందో అనే భయం వెంటాడుతోంది. తక్షణమే లోడ్‌ను తగ్గించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే చర్యలు తీసుకోవాలి.

– బి.జయరాం, రైతు, రామయ్యపుట్టుగ

కీలక దశలో..

వరిపైరు పొట్టదశకు చేరుకునే క్రమంలో నీరు తప్పక అందాల్సి ఉంది. ఈ సమయంలో మోటార్లు తిరగక రైతుల ఆందోళన చెందుతున్నారు. దీనికి తక్షణ పరిష్కారంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాస్తవానికి ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పట్టించుకోకుండా ఇన్ని కనెక్షన్లు ఎందుకు ఇచ్చారంటే ఉద్యోగులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి దృష్టి సారించాలని, లేనిపక్షంలో 250 ఎకరాల్లో వరిపంటకు నష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరికొత్తగా సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌కు ఆతిథ్యమిస్తున్న కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియం

- వేదికగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల
- అప్‌లైడ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహణ
- 60 శాస్త్రీయ సూత్రాల నమూనాల ప్రదర్శన



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కన్వీనర్, కోఆర్డినేటర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఓ సరికొత్త సైన్స్ ఎగ్జిబిషన్‌కు వేదికగా మారింది. కళాశాలలోని సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్స్, జంతుశాస్త్రం సంయుక్తంగా ఇండిజీనస్ సొసైటీ ఫర్ ఫ్రుగల్ సైన్స్ ఇన్వెన్షన్ (ఐఎస్ఎఫ్ఎస్ఐ) అప్‌స్కిల్ ప్రాక్టికల్ సొల్యూషన్స్ సహకారంతో 'సమాజంలో సైన్స్ వైబ్రేషన్స్' పేరిట రెండు రోజులపాటు ఆచరణాత్మక ధోరణి పద్ధతిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 17, 18 తేదీల్లో కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియం వేదికగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

60 శాస్త్రీయ సూత్రాలతో..

ఎగ్జిబిషన్‌లో సుమారు 60 శాస్త్రీయ సూత్రాలకు సంబంధించిన ప్రత్యక్ష నమూనాలు, వాస్తవ ప్రపంచ ఉదాహరణలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు, అక్కడి టీచర్లు/లెక్చరర్లు సద్వినియోగం చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు పిలుపునిస్తున్నారు. ఇందులో పాల్గొంటీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం డీఎస్‌టి ఇన్‌స్పైర్ పోటీలు, కెవీపీవై ఫెలోషిప్‌లు, ఎన్‌సీఈఆర్టీ ప్రయాస్ పథకాలకు ఎంపికకావడానికి దోహదపడుతుందని చెప్పారు. ఈ మేరకు బ్రోచర్‌ను ఆవిష్కరించి, వివరాలను నిర్వహణ కమిటీ ప్రతినిధులతో కలిసి వివరించారు.

నైపుణ్యాభివృద్ధికి దోహదం..

సైన్స్, టెక్నాలజీ రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆవిష్కరణలు, వాటి ప్రాథమిక శాస్త్రీయ సూత్రాలపై పట్టు సాధించడమనేది ఆచరణాత్మక (ప్రాక్టికల్స్) నైపుణ్యం ద్వారానే సాధ్యపడుతుందని కాలేజ్ అప్లైడ్ సైన్సెస్ విభాగాధిపతి, సైన్స్ ఎగ్జిబిషన్ కన్వీనర్ డాక్టర్ మధమంచి ప్రదీప్ పేర్కొన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఆర్.హరిత, డాక్టర్ వై.పోలినాయుడు, పి.సుధారాణి, ఎస్.రవిబాబు, కె.అపర్ణా మాట్లాడుతూ రెండురోజుల ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే ప్రాజెక్టులపై ప్రత్యేక పుస్తకం రూపొందిస్తామని, మూల్యాంకన పరీక్ష కూడా నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబర్చినవారికి ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నవారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తామని, వివరాలకు సెల్: 8555911961, 7702203953, 6301096643 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

రణస్థలం: 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి, దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మంగళవారం రణస్థలం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలన్నారు. జిల్లా పూర్వ అధ్యక్షుడు జి.వెంకటగిరి మాట్లాడుతూ కాంప్లెక్స్ స్థానాల్లో పని చేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు, శాశ్వత స్థానాలు కేటాయించే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి రవి భట్టు మాట్లాడుతూ జూన్‌లో బదిలీలు పొంది రిలీవర్ లేని కారణంగా అదే స్థానాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించేలా తాజా డీఎస్సీ అభ్యర్థులను నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు జి.చిన్ని కృష్ణంనాయుడు, ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ వద్దు.. పర్యావరణం ముద్దు



తిమడాంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

బూర్జ: పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా బహిరంగ సభను విజయవంతం చేయాలని పోరాట కమిటీ సమన్వయకర్త యోబ యోగి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్ దొర ఆదివాసీలకు పిలుపునిచ్చారు. మంగళవారం పోరాట కమిటీ సభ్యులు పిలుపు మేరకు తిమడాం గ్రామంలో సమావేశం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అడ్డూరిపేటలో జరిగే బహిరంగ సభకు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దళిత కార్మికుల పొట్ట కొట్టొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేసి ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములిచ్చిన దళిత కార్మికుల పొట్టకొట్టవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ మంగళవారం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో కార్మికులు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి నీరు అడుగుతున్నారు తప్ప బీరు అడగడం లేదని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో హమాలీ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగారురాజు, నాయకులు టి.రామారావు, ఎన్.సురేష్, ఎన్.రమణ, బోనెల.రాము, పి.రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ.రాజు, కె.వి రమణ, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్ టెన్నిస్ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పాతపట్నం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17, అండర్-19 బాల, బాలికల సాఫ్ట్ టెన్నిస్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు పాతపట్నం మండలం సూర్యనారాయణపురం గ్రామ సమీపంలోని అక్షర పాఠశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 270 మంది విద్యార్థులు హాజరయ్యారని రాష్ట్ర వ్యాయామ సంఘం అధ్యక్షుడు ఎన్ని శేఖర్‌బాబు తెలిపారు. కొందరు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ తిరుపతిరావు, డైరెక్టర్ రియాజ్, ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీలు కె.రాజారావు, జె.కృష్ణ, ఎస్.కృష్ణారావు, లోకేశ్వరరావు, డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


సతీష్ (ఫైల్)

పూసపాటిరేగ: మండలకేంద్రం పూసపాటిరేగలోని సినిమాహాల్ సమీపంలో వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లో వాహనాలకు వాటర్ సర్వీస్ చేస్తుండగా వాటర్ గన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి ఓ వర్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే వెంపడాం గ్రామానికి చెందిన దుక్క సతీష్ (29)వాటర్ సర్వీస్‌పాయింట్‌లో వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం వాటర్ సర్వీస్ చేస్తుండగా గన్‌కు నాజిల్ మార్చే ప్రయత్నంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి మృతిచెందాడు. మృతుడికి భార్య సుప్రియ ఉంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ కార్యకర్త..


రాజేశ్వరి (ఫైల్)

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంగన్వాడీ కార్యకర్త చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మండలంలోని దిగువ కొండపర్తి పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కె.రాజేశ్వరి(36) ఈనెల 12న గంట్యాడలో జరిగిన ఐసీడీఎస్ సమావేశానికి హాజరైంది. సమావేశం ముగిసిన తర్వాత తిరిగి భర్తతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా తామరాపల్లి జంక్షన్ వద్ద గాలికి చీర బైక్ చక్రాల్లో చిక్కుకు పోవడంతో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోగా స్థానికులు 108లో చికిత్స నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామం పరిధిలో బొబ్బిలి సీతానగరం రైల్వే స్టేషన్ మధ్య ఒడిశాలోని జయపురం గ్రామానికి చెందిన గుప్త మజ్జి (27) రైలు నుంచి జారి పడి మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు జీఆర్పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి పోయినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ గ్రామానికి చెందిన ఆరిక ధర్మారావు అనే యువకుడు మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ క్రమంలో నోటి నుంచి నురగలు కక్కుతూ కన్పించిన ధర్మారావును గమనించిన కుటుంబసభ్యులు భద్రగిరి సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ఇంట్లో తండ్రికి కొంతకాలంగా అనారోగ్యంగా ఉండడం, చికిత్స చేయిస్తున్నప్పటికీ తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రైళ్లలో దొంగకు ఐదు నెలలు జైలు

విజయనగరం క్రైమ్: రైళ్లలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడు శరత్ దిగాల్‌కు విశాఖ రైల్వే కోర్ట్ జడ్జి కార్తీక్ ఐదు నెలల 15 రోజులు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఎస్సై బాలాజీరావు మంగళవారం తెలిపారు. ఏడాది కాలం నుంచి రైళ్లలో ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుంటూ నిందితుడు శరత్ దిగాల్ చోరీలకు పాల్పడేవాడన్నారు.ఇటీవల రైలులో ఓ ప్రయాణికుడి నుంచి సెల్ ఫోన్ చోరీకి యత్నించగా పట్టుకున్నామని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని కొంధమాల్ జిల్లా జి. ఉదయగిరి మండలం, హత్తిబాలిసాహికి చెందిన శరత్ దిగాల్‌ను అరెస్ట్ చేసి సెల్ ఫోన్ రికవర్ చేసి కోర్టులో ప్రవేశ పెట్టామని చెప్పారు. ఏపీపీ శంకరరావు సాక్ష్యాలను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో రైల్వే కోర్టు జడ్జి పై విధంగా శిక్ష విధించినట్లు వివరించారు.

గణిత ఉపాధ్యాయ పోస్టు భర్తీకి ఆహ్వానం

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడిలో గల గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన గణితం బోధనకు మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారదాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 4గంటల లోగా తమ దరఖాస్తులను కళాశాలలో అందించాలని, అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50శాతం మార్కులు సాధించిన వారై ఉండాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8712625071 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌కు సిద్ధం

- సన్నద్ధమవుతున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు


జీఎల్ పురం కేజీబీవీ విద్యార్థులు రూపొందించిన వర్షపునీటితో విద్యుత్ తయారీ ప్రాజెక్టు (ఫైల్)


ఐదు ప్రాజెక్టులు గుర్తింపు పొందడంతో నాడు జిల్లా సొంతం చేసుకున్న ప్రశంసా పత్రం

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సజనాత్మకను వెలికి తీసి వారి ఆలోచనలకు పదునుపెట్టే వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్. భారత దేశంలో విద్యార్థులకు సంబంధించి అతిపెద్ద చాలెంజ్ కార్యక్రమం (స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్) అని జిల్లా విద్యాశాఖ చెబుతోంది. దీనిని మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, నీతి అయోగ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ వేదికపై తలపడేందుకు జిల్లా పరిధిలో 6–10 తరగతుల మధ్య బోధన పొందుతున్న అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన విద్యార్థులు సిద్ధం కావాలని విద్యాశాఖ జిల్లా యంత్రాంగం సూచిస్తోంది. ఈ ఏడాది జూలై 28న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 23లోగా దరఖాస్తు చేయాలి. అటుపై నవంబర్ లోగా విద్యార్థులు వారి స్కిల్స్‌కు పదునుపెట్టి నవంబర్ 30వ తేదీకి వారి ప్రాజెక్ట్‌ను సబ్‌మిట్ చేయాలి. 2026 జనవరిలో దేశవాప్తంగా వచ్చిన ప్రాజెక్టుల ఎంపిక జరుగుతుంది. ఆదే ఏడాది మార్చిలో ఎంపికైన తొలి 200 ప్రాజెక్టులకు ఆర్థిక ప్రోత్సాహం, ఏప్రిల్ నుంచి జూలై వరకు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అదే నెల 29 ప్రాజెక్టుల ప్రదర్శన ఉంటుంది.

రూ.లక్ష నుంచి సహకారం..

- దేశవ్యాప్తంగా వచ్చిన పరిష్కారాలలో అత్యంత ప్రతిభ కలిగి ఎంపికైన తొలి 200 ప్రాజెక్ట్‌లకు మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్ వారు ప్రోటోటైప్ చేయడానికి కావాల్సిన ఆర్థిక సహకారం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అందిస్తారు.
- టాప్ 200 టీమ్స్‌కు ప్రోటోటైప్ చేయడానికి కావాల్సిన సాంకేతిక సహకారాన్ని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సమకూరుస్తుంది.

ఆలోచనలకు పెద్దపీట



విద్యార్థుల ఆలోచనలకు మారథాన్ పెద్దపీట వేస్తోంది. గత ఏడాది జాతీయ స్థాయిలో మన విద్యార్థులు రూపొందించిన 5 ప్రాజెక్టులు గుర్తింపు పొందాయి. అదే స్ఫూర్తితో ఈ ఏడాది మరిన్ని ఫలితాలు సాధించాలి. తొలి 200 ప్రాజెక్టుల్లో స్థానం పొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాల్సి ఉంటుంది. అప్పుడే సంబంధిత ఆర్థిక సాయం పొందవచ్చు. జిల్లా నుంచి అత్యధిక ఐడియాలను సిద్ధంచేసి సబ్‌మిట్ చేయాలి. ప్రతి పాఠశాల నుంచి పది టీమ్‌లను సైన్స్, గణిత ఉపాధ్యాయులు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

– బి.రాజ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

లక్ష్యం ఇలా..

- ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ గురించి తెలుసుకుని ఆన్‌లైన్ పోర్టల్‌లో ముందుగా రిజిస్టర్ కావాలి.
- రెండవ దశలో విద్యార్థులకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ గురించి అవగాహన కల్పించి, ఆసక్తి గల విద్యార్థులను బృందాలుగా విభజించాలి. వారితో (https://schoolinnovationmarathon.org/registration) లింక్‌లో ఈనెల 23నాటికి ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి.
- మూడవ దశలో సమాజం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విద్యార్థులు అర్థం చేసుకుని వాటిలో ఒక సమస్యను ఎంచుకోవాలి. దీనికి సంబంధించిన ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్ రాయాల్సి ఉంటుంది.
- ఎంచుకున్న సమస్యకు సజనాత్మకతో కూడిన పరిష్కారం చూపడం, దానికి సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి.
- అత్యంత ప్రతిభావంతమైన తొలి 200 ఐడియాలలో మన ప్రాజెక్ట్ ఎంపికై తే దానిని ప్రోటోటైప్ చేసి పేటెంట్ పొందవచ్చు.

2024లో..

గత ఏడాది స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో అత్యధికంగా టీచర్స్, స్టూడెంట్స్‌లను రిజిస్ట్రేషన్ చేసి రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. దేశావ్యాప్తంగా లక్ష ఐడియాలు రిజిస్టర్ అయ్యాయి. ప్రాధాన్యత గల తొలి వెయ్యి ప్రాజెక్టుల్లో జిల్లాకు చెందిన 5 ప్రాజెక్టులకు గుర్తింపు లభించింది.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు పెదమానాపురం విద్యార్థులు


రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.సౌజన్య, ఎస్.రిషిలు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తిరుపతిరావు మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో మంగళవారం మరుపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న రగ్బీ క్రీడలో తమ పాఠశాల తరపున పాల్గొంటారని చెప్పారు.

జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైన రెడ్డి లక్ష్మునాయుడు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న బాడీ బిల్డింగ్‌పోటీలకు జిల్లాలోని చీపురుపల్లి పట్టణానికి చెందిన రెడ్డి లక్ష్మునాయుడు అర్హత సాధించాడు. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్ష్మునాయుడు జాతీయ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు, కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావులు తెలిపారు. డిసెంబర్ 14,15 తేదీల్లో చండీగఢ్‌లో జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున లక్ష్మునాయుడు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో పాటు జాతీయ పోటీలకు అర్హత సాధించిన లక్ష్మునాయుడిని అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలకు స్పందన


స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


తైక్వాండో పోటీల్లో తలపడుతున్న బాలికలు


సైక్లింగ్ చేస్తున్న క్రీడాకారులు

విజయనగరం: పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి ఏడాది విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపికల్లో ఆయా క్రీడాంశాల్లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం విజయనగరం శివారులో గల విజ్జి స్టేడియంలో అండర్–14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన తైక్వాండో పోటీల్లో 230 మంది క్రీడాకారులు పాల్గొనగా, సైక్లింగ్ పోటీల్లో 80 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. అదేవిధంగా స్కేటింగ్ క్రీడాంశంలో అండర్–11,14,17 వయస్సుల విభాగాల్లో నిర్వహించిన ఎంపికలకు 100మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మిలు తెలిపారు. ఎంపిక పోటీలను ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

‘వినరా ఓ వేమ’ చిత్రం ప్రేక్షకాదరణ పొందాలి


వినరా ఓ వేమ చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ఉత్తరాంధ్ర సంస్కృతిని, మాండలికాన్ని ప్రస్ఫుటపరిచే విధంగా రూపొందించిన ‘వినరా ఓ వేమ’ చిత్రం ప్రేక్షకాదరణ పొంది మంచి విజయం సాధించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకాంక్షించారు. పల్సర్ బైక్ రమణ తొలిసారిగా కథా నాయకుడిగా నటించిన ఈ చిత్రం పోస్టర్‌ను కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలంగాణ యాసతో రూపొందిన అనేక చిత్రాలు విజయవంతమయ్యాయని గుర్తు చేశారు. అదే రీతిన ఉత్తరాంధ్ర యాసతో, పూర్తి గ్రామీణ వాతావరణంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. చిత్ర కథానాయకుడు, పల్సర్ బైక్ రమణ, దర్శకుల్లో ఒకరైన ప్రశాంత్ మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి వినరా ఓ వేమ చిత్రాన్ని రూపొందించామన్నారు. వచ్చే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 70 కేంద్రాల్లో విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు ఆదరించి చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. చిత్ర కథానాయికగా వైష్ణవి, నిర్మతగా సురేష్ వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో చిత్రం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోల బంద్ నేడు

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సుల వల్ల నాలుగు లక్షల మంది ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని, ఈ మేరకు బుధవారం ఆటోల బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు రెడ్డి నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోట జంక్షన్ వద్ద ఉదయం 6 గంటల నుంచి బంద్ కొనసాగిస్తామని, భారీ ఎత్తున ర్యాలీ, గంటస్తంభం మీదుగా బాలాజీ కూడలి, ఆర్‌టీసీ కాంప్లెక్స్, మయూరి కూడలి వరకు ఉంటుందన్నారు. జీఓ నంబర్ 21 రద్దుచేయాలని, ఏడాదికి వాహన మిత్ర కింద డ్రైవర్లకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంద్‌లో ప్రతి ఆటో డ్రైవర్ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చెక్ బౌన్స్ కేసులో జైలుశిక్ష

గజపతినగరం రూరల్: బొండపల్లి మండలంలోని గొట్లాం గ్రామానికి చెందిన శిడగం నాగరాజు వద్ద అంబటివలస గ్రామానికి చెందిన పాలూరు అప్పల నరసింహానాయుడు రూ.4లక్షల ఏభైవేలు అప్పుగా తీసుకుని తీర్చలేదు. ఈ క్రమంలో ఆయన ఇచ్చిన చెక్ బౌన్స్ అవ్వడంతో అప్పు ఇచ్చిన వ్యక్తి గజపతినగరం కోర్టును ఆశ్రయించగా అప్పు తీసుకున్న వ్యక్తికి రూ.9లక్షల జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు.

బైక్, ట్రాక్టర్ ఢీ: ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధి చంద్రంపేట సమీపంలో బైక్, ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయని ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఈ నెల 15న కింజంగి గ్రామానికి చెందిన వేమిరెడ్డి మురళీకృష్ణ, వేమిరెడ్డి గణేష్‌రావులు విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టిందని చెప్పారు. వేమిరెడ్డి మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల నిరసన


విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ఎదుట నిరసన నినాదాలతో ఉపాధ్యాయులు


పార్వతీపురం రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పార్వతీపురం రూరల్: ఏపీటీఎఫ్ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వారం రోజుల నిరసనలో భాగంగా మంగళవారం పార్వతీపురం జిల్లాలో ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన వ్యక్తంచేశారు. ఈ నిరసనలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, నల్ల బాలకృష్ణరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిపడిన కరువు భత్యాన్ని ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి. అలాగే 12వ పీఆర్‌సీని నియమించాలి. ఉద్యోగులకు ఆరోగ్య పథకం ద్వారా చికిత్స చేయడానికి నగదు పరిమితిని రూ.25లక్షకు పెంచాలి. కంట్రిబ్యూటరీ పింఛన్ పథకాన్ని విధానంలోకి తీసుకురావాలని నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దుచేయాలని బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయింపు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని డీఆర్‌ఓ కె.హేమలతకు అందజేశారు. కార్యక్రమంలో కొమరాడ, వీరఘట్టం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భారత్‌తో భాగస్వామ్యానికి ఫ్రాన్స్ ఆసక్తి

- ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి

నెల్లిమర్ల రూరల్: భారత్‌తో విద్యా భాగస్వామ్యానికి ఫ్రాన్స్ దేశం ఆసక్తి చూపిస్తోందని ఆ దేశం కాన్సులేట్ జనరల్ మార్క్ లామి అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఫ్రాన్స్ దేశం వివిధ విద్యా సంస్థలతో నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తోందన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన కంపెనీలు భారత్‌లో విద్యార్థులకు ఉన్నత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. భారత్‌లో ఫ్రాన్స్ రాయబార కార్యాలయాలు, ఇండో ఫ్రాన్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ కంపెనీలు అత్యంత సన్నిహితంగా పనిచేస్తున్నాయన్నారు. భారతీయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 15 ఫ్రెంచ్ కంపెనీలు ఏపీ, ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడుతున్నాయని, నైపుణ్యం కలిగిన యువతకు అతి తక్కువ సమయంలోనే మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్రెంచ్ కంపెనీ డస్సాల్ట్ సిస్టమ్స్‌తో సెంచూరియన్ వర్శిటీ భాగస్వామ్యం ప్రశంసనీయమన్నారు. విద్యా బోధనలో భాగంగా సెంచూరియన్ విశ్వ విద్యాలయం నైపుణ్యాలను జోడించడం, విద్యాభివృద్ధికి వివిధ కార్యక్రమాలను అమలు చేయడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. అనంతరం వివిధ ల్యాబ్‌లను సందర్శించి జీటీఎం ల్యాబ్, వెల్‌నెస్ సెంటర్, త్రీడీ డేటా సెంటర్, బ్రీడింగ్ ల్యాబ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు, చాన్సలర్ జీఎస్‌ఎన్ రాజు, వీసీ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఏసీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


ప్రమాదంలో మృతిచెందిన ఆదినారాయణ


ఆదినారాయణ(ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామానికి చెందిన మరడాన ఆదినారాయణ(65) సోమవారం రాత్రి నందివానివలస రహదారి పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. ఆదినారాయణ విశ్రాంత మిలటరీ ఉద్యోగి. ఉద్యోగ విరమణ అనంతరం సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస జంక్షన్ పరిధిలో నయారా పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో బంక్‌నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఫకృద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య మంగమ్మ, కుమార్తెలు దివ్య, చిన్ను ఉన్నారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి..

కొత్తవలస: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల పీడబ్ల్యూ ఆఫీస్ వద్ద గుర్తు తెలియని 25 సంవత్సరాలు వయస్సు గల యువకుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు.ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వంటిపై తెలుపు రంగు ప్యాంట్ కాఫీ కలర్ నెక్క్ బనియన్ ఉన్నాయి. ముక్కు నుంచి రక్తం కారుతూ ఉండడాన్ని పోలీసులు గమనించారు. సదరు వ్యక్తి సోమవారం రైల్వే స్టేషన్‌లో గల ఫ్లాట్‌ఫామ్–1లో సంచరిస్తూ ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ముక్కు నుంచి రక్తం కారడంతో అనుమానాస్పదంగా మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు రెవెన్యూ కార్యదర్శి లాలం రాధాకృష్ణ ఫిర్యాదుపై ఎస్సై జోగారావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

నాగావళి తీరంలో కొనసాగుతున్న వెతుకులాట

- తన తల్లే అంటున్న రాజాం పట్టణవాసి పైడిరాజు


ఘటనా స్థలంలో గుర్తించిన పాదరక్షలు తన తల్లివేనని చెబుతున్న పైడిరాజు తదితరులు

పాలకొండ రూరల్: ఇటీవల నాలుగు రోజుల క్రితం పాలకొండ మండలం గొట్ట మంగళాపురం సమీపంలో గుర్తు తెలియని మహిళ వంతెనపై నుంచి నాగావళి నదిలో దూకేసింది. ఈ క్రమంలో అక్కడి స్థానికులు అందించిన సమాచారంతో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా పరిధిలో నదీతీర పరీవాహక మండలాల పోలీసులు మహిళను వెతుకులాడేందుకు దృష్టి పెట్టారు. పాలకొండ ఎస్సై కె.ప్రయోగమూర్తి, స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు, ఈతగాళ్లు తీరం వెంబడి ఉన్న చిన మంగళాపురం, బొడ్డవలస, యరకారాపురం, గోపాలపురం, అన్నవరం, డొంకలపర్త, కిలంతర, సంకిలి తదితర ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా మంగళవారం నాటికి కూడా ఎక్కడా మహిళ ఆచూకీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మరింత క్షుణ్ణంగా పరిశీలన చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు.

మా అమ్మే..!


నాగావళి తీరంలో కొనసాగుతున్న గాలింపు

ఇదిలా ఉండగా ఈ ఘటనలో నదిలో దూకిన మహిళకు సంబంధించి నిన్నటి వరకూ ఎటువంటి ఆచూకీ లభ్యం కాకపోగా కేవలం వంతెనపై పాదరక్షలను మాత్రమే అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో విజయనగరం జిల్లా రాజాం పట్టణ పరిధి మల్లయ్య పేటకు చెందిన కాకర్ల పైడిరాజు ఘటనాస్థలంలో అధికారులను ఆశ్రయించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన తల్లి పార్వతి(54) ఈనెల 13న శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోవడంతో తెలిసిన వారిని వాకబు చేశామని, ఎక్కడ ఉన్నది తెలియక పోవడంతో ఆదివారం ఉదయం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేసి, అటుపై నదిలో మహిళ దూకిన విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చామన్నారు. అధికారులు గుర్తించిన పాదరక్షలు తన తల్లివేనని ధ్రువీకరించారు. దీర్ఘకాల అనారోగ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్న తన తల్లికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. త్వరలో ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు వివరించారు. కేవలం భయంతో ఆమె పని చేసి ఉండవచ్చని కుమారుడు పైడిరాజు చెబుతున్నాడు. విషయం తెలుసుకున్న అధికారులు మాట్లాడుతూ మృతదేహం లభ్యమైతే తప్ప ఈ విషయాన్ని నిర్ధారణ చేయలేమన్నారు.